సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 29 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.27,690

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27,690, కనిష్టంగా రూ.13 వేల ప్రకారం ధర పలికాయి.



అంతా మా ఇష్టం

రైతు సేవా కేంద్రాల అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్దపీట వేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. 8లో

గరిష్టం/కనిష్టం
35.5°/22.8°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సమష్టి కృషితో నేర నియంత్రణ

- సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగవంతం
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రత్న



ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: సమష్టి కృషితోనే నేర నియంత్రణ సాధ్యమని, అందువల్ల కేసుల దర్యాప్తులో అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులకు సూచించారు. శనివారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తి, కదిరి, హిందూపురం, పెనుకొండ సబ్ డివిజన్ల పరిధిలో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గత ఆరు నెలల్లో వివిధ కేసుల్లో పురోగతి సాధించిన పోలీసులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తు వేగవంతమవుతుందని, అందరూ అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. చోరీల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించాలన్నారు. పోక్సో కేసుల్లో నివేదికలు త్వరగా సిద్ధం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి పూట గస్తీలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు తీసుకోవాలన్నారు. వాటిని నేర రికార్డులతో సరిపోల్చి నేరగాళ్లను పట్టుకోవాలన్నారు. నేర సమీక్షలో డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణ, కేవీ మహేష్, నరసింగప్ప, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సెలవులో రామగిరి సీఐ

- రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

చెన్నేకొత్తపల్లి: రామగిరి సీఐ శ్రీధర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ నంబర్‌ను కూడా ఆయన శుక్రవారం స్టేషన్‌లోనే సరెండర్ చేశారు. దీంతో ఆయన దీర్ఘకాలిక సెలవులో వెళ్లారని, తిరిగి ఇక్కడికి వచ్చి విధులు నిర్వర్తించడం అనుమానమేనన్న చర్చ జరుగుతోంది.

పది నెలలు కూడా కాకుండానే...

రామగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీధర్ పదినెలల కిందటే విధుల్లో చేరారు. సర్కిల్‌లో సమస్యాత్మక గ్రామాలు ఎక్కువగా ఉండటంతో నిరంతరం ఒత్తిళ్లలోనే విధులు నిర్వర్తించినట్లు తెలుస్తోంది. ప్రతి కేసులోనూ టీడీపీ నేతలు కలుగజేసుకోవడం...టీడీపీ ముఖ్యనాయకులు ఆదేశాలు జారీ చేయడంతో విసిగిపోయి సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది.

- రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైఎస్సార్ సీపీకి చెందిన కురబ లింగమయ్య హత్య.. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో రాగా, హెలీప్యాడ్ వద్దకు భారీగా జనం వచ్చి హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతినడం. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో ఓ దళిత బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపాయి. ఆయా ఘటనలకు సంబంధించి సీఐ శ్రీధర్‌పై తీవ్రమైన ఒత్తిళ్లు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. స్థానిక ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ తరచూ సెలవులో వెళ్తుండటంతో ఆయా కేసుల దర్యాప్తు చాలా నిదానంగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే సీఐ శ్రీధర్ ఆందోళన చెందారని, మరోవైపు అధికార పార్టీ నేతల ఒత్తిడికి తట్టుకోలేక సీఐ సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది.

కౌన్సెలింగ్ రసాభాస



కౌన్సెలింగ్‌కు హాజరైన దివ్యాంగుడు



అధికారుల తీరుపై నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

- గందరగోళంగా సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ
- లోపభూయిష్ట విధానాలపై ఉద్యోగుల ఆగ్రహం
- ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్దపీట వేయడంపై నిలదీత

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ రసాభాసగా సాగింది. అధికారుల లోపభూయిష్ట విధానాలపై ఉద్యోగులు కన్నెర్ర జేశారు. శనివారం అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్సీ భవన్, సాయినగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ భవన్, తపోవనంలోని పుష్ప కన్వెన్షన్ హాల్, హౌసింగ్ బోర్డులో జయమణెమ్మ కల్యాణ మండపం వేదికగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించడంతో ఉద్యోగులతో ఆయా ప్రదేశాలు కిక్కిరిసిపోయాయి.

కేంద్రాల్లో ఆందోళన

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ నిర్వహించడంపై ఉద్యోగులు కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కొందరు తమ నియోజకవర్గాల్లోని స్థానాలను బ్లాక్ చేయించినట్లు తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీలు చూపకుండా.. మొక్కుబడిగా కౌన్సెలింగ్‌ను నిర్వహించడాన్ని నిరసిస్తూ కౌన్సెలింగ్ కేంద్రాల్లోనే ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. అభ్యర్థుల ఆందోళనల మధ్య కాసేపు కౌన్సెలింగ్ నిర్వహించడం, ఆ తరువాత వాయిదా పడటం.. ఇలా ఆగుతూ.. సాగుతూ ముందుకు నడిపించారు.

మితిమీరిన జోక్యం..

టీడీపీ ఎమ్మెల్యేల మితిమీరిన జోక్యంతో కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళానికి దారి తీసింది. తమ నియోజకవర్గాల్లోని ఖాళీలను బ్లాక్ చేయాల్సిందిగా కొందరు ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారని సచివాలయ ఉద్యోగులు ఆరోపించారు. దీంతో ఆయా స్థానాలను అధికారులు ఖాళీ చూపకుండా దూర ప్రాంతాల్లోని స్థానాలను మాత్రమే చూపించారని వాపోయారు. ఈ విషయంపై సచివాలయ ఉద్యోగులు, యూనియన్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. డీపీఆర్సీ భవన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ సందర్భంగా డీపీఓ, కొందరు సిబ్బంది పదేపదే బయటకు వెళ్లి రావడం, కొందరితో రహస్యంగా మంతనాలు సాగించడం చూసిన అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

సౌకర్యాల్లేక ఇబ్బందులు

డీపీఆర్సీ భవన్, అంబేడ్కర్ భవన్‌లో అధికారులు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. ముఖ్యంగా డీపీఆర్సీలో పై అంతస్తులో కౌన్సెలింగ్ నిర్వహించడంతో దివ్యాంగులు నరక యాతన అనుభవించారు. చంటి బిడ్డల తల్లుల వేదన వర్ణనాతీతంగా మారింది.

ముగిసిన కౌన్సెలింగ్

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని 11 మునిసిపాలిటీల్లోని సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. అర్ధరాత్రి వరకు ప్రక్రియ చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పర్యవేక్షణలో జేఎన్ఎస్ నగర్‌లోని జయమణెమ్మ కల్యాణమంటపంలో ఎడ్యుకేషన్, వెల్ఫేర్, పుష్ప కన్వెన్షన్ హాలులో శానిటేషన్, అమినిటీస్, నగరపాలక సంస్థలో ప్లానింగ్ కార్యదర్శులకు కౌన్సెలింగ్ జరిగింది.

'స్పౌజ్'పై గందరగోళం..

నిబంధనలకు వ్యతిరేకంగా స్పౌజ్ చూపుతూ అక్రమాలకు పాల్పడుతుండటంపై కొంత మంది వెల్ఫేర్ కార్యదర్శులు అభ్యంతరాలు లేవనెత్తడంతో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించారు. వివిధ మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలో మొత్తం అమినిటీ సెక్రటరీలు 78, వార్డు ఎడ్యుకేషన్ 231, ప్లానింగ్ 85, శానిటేషన్ 184, వెల్ఫేర్ 232, అడ్మిన్ సెక్రటరీలు 143 మందికి ఐదేళ్లు పూర్తి అవడంతో వారు వేకెన్సీలో వచ్చారు. ర్యాంకు, స్పౌజ్, దివ్యాంగులు తదితరాల ఆధారంగా కోరుకున్న స్థానాలకు బదిలీ చేశారు. ఈ నెల 30న ఉద్యోగులకు మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్ ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు.

తడ'బడి'న పాఠం



అగళి మండల పరిధిలోని ఐ.తోణసన్నపల్లి గ్రామంలోని పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు వీరు. ఇక్కడ ముగ్గురు విద్యార్థులుండగా.. ఒక ఉపాధ్యాయురాలు పాఠాలు చెబుతున్నారు. అలాగే నందరాజన్నపల్లి గ్రామంలోనూ నలుగురు విద్యార్థులుండగా.. ఒక ఉపాధ్యాయురాలిని ప్రభుత్వం నియమించింది.



ఇది అగళి మండల పరిధిలోని కంబదపల్లి ప్రాథమిక పాఠశాల. 1 నుంచి 5 వరకు తరగతులు నిర్వహిస్తున్నా... ఇక్కడ ఈ విద్యా సంవత్సరం నాలుగో తరగతిలో వర్షిణి అనే విద్యార్థిని మాత్రమే చేరారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయుడు రవి చిన్నారికి పాఠాలు చెబుతున్నారు. గ్రామంలో 1,2 తరగతుల విద్యార్థులు చాలా మంది ఉన్నా... వారంతా సమీపంలోని మధుడి గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్నారు.

అగళి: కూటమి సర్కార్‌పై తల్లిదండ్రులకు ఉన్న నమ్మకానికి ఈ రెండు చిత్రాలు అద్దం పడుతున్నాయి. వైఎస్ జగన్ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగా, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు. కానీ కూటమి సర్కార్ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు కళకళలాడుతుండగా... సర్కారు బడులు వెలవెలబోతున్నాయి.

రైళ్లపై నిఘా పెంచాలి

- జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంతకల్లు: రైళ్లపై నిఘా పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. శనివారం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఎస్సీఆర్ డీఆర్ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో వంతెనల వివరాలతో పాటు చెరువులు, నదులు, డ్యామ్‌లకు సమీపంలో ఉన్న రైలు మార్గాలపై రైల్వే జీఎం ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షాలు కురిసే మార్గాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. సిగ్నలింగ్ వ్యవస్థలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తకుండా జాగ్రత్తలను పాటించి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. లోటుపాట్లు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం రైలు కార్యకలాపాలను నిర్వహించడానికి సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతి నిలయం: జిల్లాలోని 46 ఆశా కార్యకర్తల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజాబేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో నియామకాలు జరుగుతాయన్నారు. 28న నోటిఫికేషన్, ఈనెల 30 నుంచి జూలై 4 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. జూలై 4వ తేదీ నుంచి జూలై 7 వరకు దరఖాస్తుల పరిశీలన, జూలై 8న మెరిట్ జాబితా ప్రదర్శన, జూలై 8 నుంచి 10వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, జూలై 11న తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. ఖాళీల వివరాల కోసం పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులను సంప్రదించాలని కోరారు.

నాంధేడ్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నాందేడ్-తిరుపతి మధ్య జూలై 5 నుంచి 27 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నాంధేడ్ జంక్షన్‌లో రైలు (07015) జూలై 5 శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 10.10 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. ఈ రైలు జూలై 5వ తేదీ నుంచి 26వ తేదీ (4 సర్వీసులు) వరకు శనివారాలు మాత్రమే తిరుగుతుందన్నారు. అదేవిధంగా తిరుపతి జంక్షన్ నుంచి (07016) ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు నాంధేడ్ చేరుకుంటుందని వెల్లడించారు. జూలై 6 నుంచి 27వ తేదీ వరకు ఆదివారాల్లో మాత్రమే ఈ రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, కర్నూలు, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఏసీ ఫస్ట్ క్లాస్, 2 టైర్ ఏసీ, 3టైర్ ఏసీతోపాటు స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయన్నారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల నిరసన



సమస్యలు పరిష్కరించాలని నినదిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రశాంతి నిలయం: పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యల పరిష్కారం కోసం శనివారం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఐవీఆర్ఎస్‌లో ఫీడ్‌బ్యాంక్ ఆధారంగా పంచాయతీ కార్యదర్శుల పనితీరును నిర్ణయించడం బాధాకరమన్నారు. గ్రామ పంచాయతీల్లో ఎక్కువ మజరా గ్రామాలు ఉండడం వల్ల ట్రైసైకిల్స్ ద్వారా ప్రతి గ్రామానికీ వెళ్లడానికి ఇబ్బందిగా ఉందన్నారు. ,ప్రతి గ్రామానికీ ఒక క్లాప్ మిత్రను నియమించి ఇళ్లను బట్టి వారి వేతనాన్ని ప్రభుత్వమే నిర్ణయించి చెల్లించాలని కోరారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లను శానిటేషన్, పీడబ్ల్యూఎస్ స్కీంలలో పాల్గొనే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని, సచివాలయాల్లో రేషనలైజేషన్‌లో భాగంగా మిగులు ఉద్యోగులను పంచాయతీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులతో సర్వేలు చేయించేందుకు పూర్తి అజమాయిషీ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో డీఆర్‌ఓను కలసి అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంచాయతీలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థి బలవన్మరణం



నారాయణస్వామి (ఫైల్)

బత్తలపల్లి: డిగ్రీ పరీక్షల్లో ఫెయిలైన ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రామాపురం గ్రామానికి చెందిన కప్పల ఆదినారాయణ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు కప్పల నారాయణస్వామి (22) అలియాస్ బిందు డిగ్రీ పరీక్షల్లో ఫెయిలయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురైన నారాయణస్వామి శనివారం సాయంత్రం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. కాసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

అర్ధంతరంగా ఆగిన బదిలీలు

- పీఆర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు కౌన్సెలింగ్
- తప్పుడు స్పౌజ్ సర్టిఫికెట్లు సమర్పించారంటూ ఆందోళన
- సాయంత్రం కౌన్సెలింగ్ నిలిపేసిన అధికారులు



అనంతపురంలోని పీఆర్ సర్కిల్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

అనంతపురం సిటీ: తప్పుడు స్పౌజ్ సర్టిఫికెట్లు సమర్పించారంటూ ఆందోళనకు దిగడంతో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీ అర్ధంతరంగా ఆగింది. అనంతపురంలోని పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.జహీర్ అస్లాం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లా పీఆర్ హెడ్ మురళీమోహన్, ఈఈ ప్రభాకర్‌రెడ్డి, డీఈఈలు కె.లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, డీఎల్ మురళి, జింకల కృష్ణజ్యోతి, సూపరింటెండెంట్లు ఖాజీ మొహిద్దీన్, రమాదేవి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం 5.50 వరకు కౌన్సెలింగ్ సజావుగా సాగింది.

సాయంత్రం ఆగిన కౌన్సెలింగ్..

సాయంత్రం 5.50 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగింది. ఆ తరువాత అర్ధంతరంగా ఆగిపోయింది. కౌన్సెలింగ్‌లో కొందరు సచివాలయ ఉద్యోగులు పెళ్లి కాకపోయినా.. తప్పుడు స్పౌజ్ సర్టిఫికెట్లు సృష్టించి సమర్పించారంటూ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. వాటి సంగతి తేల్చాకే కౌన్సెలింగ్ కొనసాగాలని, అప్పటి వరకు ఆపేయాలని డిమాండ్ చేస్తూ అక్కడే బైఠాయించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సెలింగ్ ఆపేయాల్సిందేనంటూ పట్టుబట్టారు. విధిలేక అధికారులు కౌన్సెలింగ్ నిలిపివేశారు.

కేసులు నమోదు చేయండి..

పెళ్లి కాకపోయినా.. కొందరు తప్పుడు స్పౌజ్ సర్టిఫికెట్లు సమర్పించడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రకటించారు. అయితే అధికారులు ఎటువంటి సమాధానం ఇవ్వకుండానే కౌన్సెలింగ్ హాల్ నుంచి ఇంటి దారి పట్టారు.

అంతా మా ఇష్టం



బదిలీల కౌన్సెలింగ్‌లో పాల్గొన్న రెండు జిల్లాల జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు



కౌన్సెలింగ్ హాలు వద్ద ఎగబడుతున్న వీఏఏలు

- ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియలో పారదర్శకత కరువు
- నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ
- సర్వత్రా విమర్శలు

అనంతపురం అగ్రికల్చర్: రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ, కౌన్సెలింగ్ గందరగోళంగా తయారైంది. పారదర్శకత కరువైంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ సాగిస్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. పలుకుబడి, డబ్బు, ప్రజాప్రతినిధుల సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత, సీనియార్టీ పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ చేపడుతున్నారని అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు అసిస్టెంట్లు మండిపడుతున్నారు.

ప్రణాళికేదీ...?

కలెక్టర్ అనుమతితో ఈనెల 30లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ (వీఏఏ)కు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా తయారైంది. రెండు జిల్లాల జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, సూపరింటెండెంట్ల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పద్ధతి, ప్రణాళిక లేకుండా చేపట్టడంతో ఏం జరుగుతుందనే వీఏఏలు ఆందోళనతో ఎగబడ్డారు. ర్యాంకులు, మెరిట్ ప్రకారం వీఏఏలు పట్టుబట్టగా, అధికారులు మాత్రం డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారం కొనసాగిస్తామని చెప్పారు. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియ గంట పాటు నిలిపేశారు. చివరకు ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు అధికారులు అంగీకరించారు.

సోమవారం ఉత్తర్వులు..

ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం పోస్టులు 282 ఉండగా... అందులో పనిచేస్తున్న వారు 248 మంది ఉన్నారు. అందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వీఏఏలు 229 మంది బదిలీకి అర్హత ఉన్నట్లు తెలిపారు. మరో 19 మంది రిక్వెస్ట్ కింద దరఖాస్తు చేసుకున్నారు. అటు ఉద్యానశాఖ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 323 మంది వీహెచ్ఏలు ఉండగా అందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 280 మందికి బదిలీలు చేపట్టారు. మరికొందరు రిక్వెస్ట్ కింద దరఖాస్తు చేసుకున్నారు. శనివారం రెండు జిల్లాల నుంచి తరలివచ్చిన వీహెచ్ఏలు ఆప్షన్లు ఇచ్చేశారు. సోమవారం సాయంత్రానికి బదిలీ ఉత్తర్వులు ఇస్తామని అధికారులు తెలిపారు. ఖాళీల వివరాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఆప్షన్లు ఇవ్వడానికి వీహెచ్ఏలు కూడా ఇబ్బంది పడ్డారు. పట్టుపరిశ్రమశాఖ అసిస్టెంట్ల బదిలీలు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే అడ్డు!

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ పేర్లు ఉండటంతో కక్ష సాధింపు
- రాప్తాడులో ఆగిపోయిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



విలేకరులతో మాట్లాడుతున్న భీమ్ రావ్ యువజన సంఘం నాయకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాప్తాడులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగకుండా ఎమ్మెల్యే అడ్డుపడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పాంప్లెట్‌లో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రొఫెసర్ సాకే రాజేష్ కుమార్ పేర్లు ముద్రించడాన్ని సహించలేక కక్షసాధింపులకు దిగినట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆదేశాలతో నిర్వాహకులకు అధికారులు నోటీసులిచ్చి కార్యక్రమాన్ని నిలిపివేయించారు. వివరాలు.. రాప్తాడులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భీమ్ రావ్ యువజన సంఘం నాయకులు 2021 ఏప్రిల్‌లో తీర్మానం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు విగ్రహ ఏర్పాటుకు తహసీల్దార్, ఎంపీడీఓ అనుమతి తీసుకున్నారు. విగ్రహ ప్రతిష్ట కోసం చందాలు వసూలు చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రూ.2 లక్షలు, శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలానికి చెందిన ప్రొఫెసర్ సాకే రాజేష్ కుమార్ రూ.7 లక్షల విరాళం అందించారు. పలువురి ద్వారా మొత్తం రూ.15 లక్షలు వసూలు చేసిన భీమ్ రావ్ యువజన సంఘం నాయకులు రాప్తాడులో విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆదివారం ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేశారు. నెల క్రితమే ఉత్సవానికి సంబంధించి పాంప్లెట్‌లు కొట్టించి అందరికీ పంచారు.

ఆ రెండు పేర్లు తొలగించండి..!

విగ్రహావిష్కరణ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహోదగ్రులైనట్లు తెలిసింది. అధికారులకు ఫోన్ చేసి మండిపడినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, సాకే రాజేష్ కుమార్ పేర్లు ఉండకూడదని ఆదేశించడంతో అధికారులు ఆగమేఘాలపై స్పందించారు. ఎలాగోలా కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో విగ్రహ ఏర్పాటుకు పర్మిషన్ లేదంటూ నిర్వాహకులకు పోలీసుల ద్వారా నోటీసులు ఇచ్చారు. పర్మిషన్ తీసుకుని పనులు చేసుకోవాలని, లేని పక్షంలో అరెస్ట్ చేస్తామని పోలీసులు హెచ్చరించినట్లు తెలిసింది.

పార్టీలకతీతంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశాం..

నోటీసులపై భీమ్ రావ్ యువజన సంఘం అధ్యక్షుడు కటిక జయరామ్, వైస్ ప్రెసిడెంట్ బాల నాగేంద్ర విలేకరులతో మాట్లాడారు. 2021 నుంచి పనులు జరుగుతున్నా అధికారులు ఏనాడూ అడ్డు చెప్పలేదన్నారు. పార్టీలకతీతంగా చందాలు వసూలు చేశామన్నారు.పాంప్లెట్‌లో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రొఫెసర్ రాజేష్ కుమార్ పేర్లు తొలగించి కార్యక్రమాన్ని చేసుకోవచ్చని సమాచారమిచ్చారన్నారు. సర్పంచు సాకే తిరుపాల్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ కూడా దళితులే అని, అయినా విగ్రహ ప్రతిష్ఠకు అనుమతి లేదంటూ అడ్డు పడడం దళిత జాతికే సిగ్గు చేటన్నారు.

ఆర్థిక స్తోమత లేనివారికి ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

హిందూపురం: వివిధ కేసుల్లో రిమాండ్‌లో ఉంటున్న వారిలో ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. శనివారం హిందూపురం సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. ఏ కేసులో ఎంత కాలంగా రిమాండ్‌లో ఉంటున్నారని ఆరా తీశారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోగలరా.. సబ్‌జైలులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ బెయిల్ కోసం న్యాయవాదులను ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేని వారికి అర్హత ఉంటే ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. న్యాయ సహాయం అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామన్నారు. జైళ్లకు రావడం వల్ల స్వేచ్ఛ, శాంతి కోల్పోతారని, కుటుంబాల గౌరవ మర్యాదలు కూడా దెబ్బతింటాయని తెలిపారు. కనీసం జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రిమాండ్ ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే రాత పూర్వకంగా రాసి జైలు ఆవరణలోని ఫిర్యాదుల పెట్టెలో వేయాలన్నారు. అనంతరం జైలు గదులు, వంటగది పరిశీలించి ఆహార పదార్థాల తయారీ కోసం ఉపయోగించే సరుకుల గురించి సబ్‌జైలర్ హనుమప్పను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నూరప్ప, న్యాయవాదులు శివశంకర్, సుధాకర్, సందీప్, లోక్ అదాలత్ సభ్యులు హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో శిక్షణకు వజ్రకరూరు సర్పంచ్



శిక్షణలో పాల్గొన్న సర్పంచ్ మోనాలిసా తదితరులు

వజ్రకరూరు: ఢిల్లీలోని డాన్‌బోస్‌కో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం ప్రారంభమైన 'షీ రెప్రజెంట్స్–2025' అనే ప్రతిష్టాత్మక నాయకత్వ అభివృద్ధి– శిక్షణకు వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా హాజరయ్యారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ అనే సంస్థ దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించి.. ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు మంచి నాయకత్వ లక్షణాలు, సామర్థ్యం కలిగిన 45 మంది మహిళా ప్రజాప్రతినిధులను ఎంపిక చేశారు. అందులో వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా ఒకరు. వీరికి ఏడు రోజులపాటు పాలన, కమ్యూనికేషన్, ప్రజానైతికత, నాయకత్వ నైపుణ్యాలు, సమస్యలు–వాటిపరిష్కార పద్ధతులు, పార్లమెంట్ సందర్శన తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. మోనాలిసా మాట్లాడుతూ ఢిల్లీ శిక్షణకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు.

పశువులను తప్పించబోయి ఢీకొన్న కార్లు

పెనుకొండ: పశువులను తప్పించే క్రమంలో రెండు కార్లు అదుపుతప్పి ఢీకొన్నాయి. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం శనివారం కారులో హైదరాబాద్ వెళుతుండగా.. పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద పశువులు అడ్డు రావడంతో డ్రైవర్ స్లో చేశాడు. ఆ సమయంలో ఈ కారును వెనక వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ హఠాత్పరిణామంతో కార్లలో ప్రయాణిస్తున్నవారు భయాందోళనకు గురయ్యారు. అయితే ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న పెనుకొండ పోలీసులు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పడమే కాకుండా కారును రోడ్డు పక్కన నిలిపి.. వారిని మరో వాహనంలో పంపించారు.

ఫేక్ కాల్‌తో నగదు మాయం

రొద్దం: సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతూనే ఉన్నారు. బ్యాంకు అధికారుల పేరిట బురిడీ కొట్టించి మోసం చేస్తున్నారు. రొద్దం మండలం గౌరాజుపల్లికి చెందిన ఓ యువతికి శనివారం అపరిచిత నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని పరిచయం చేసుకుని ఆధార్ అడిగాడు. ఆ యువతి ఆధార్ నంబర్ చెప్పి ఫోన్ పెట్టేయగానే తన బ్యాంకు ఖాతాలోని రూ.1000 నగదు డ్రా అయిపోయింది. తాను మోసపోయానని ఆ యువతి లబోదిబోమంటోంది.

ఉచిత వైద్యం.. సత్యసాయి లక్ష్యం

- గ్లోబల్ మెడికల్ సదస్సులో డాక్టర్ సుందరేశ్ దబిర్





యూనివర్సిటీ ఆఫ్ చికాగో, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టోక్యో సంస్థలతో చేసుకున్న ఒప్పంద పత్రాలను చూపుతున్న ట్రస్ట్ బృందం, మాట్లాడుతున్న సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ సుందరేశ్ దబిర్

ప్రశాంతి నిలయం: నిరుపేదలకు పైసా ఖర్చు లేకుండా అత్యాధునిక వైద్యం అందించడమే సత్యసాయి లక్ష్యమని, సత్యసాయి వైద్య సంస్థలు ఈ మేరకు పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైట్ ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్. సుందరేశ్ దబిర్ అన్నారు. శనివారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, వైద్య సంస్థల ఆధ్వర్యంలో సత్యసాయి 'ఆదర్శ వైద్యం' అన్న అంశంపై ప్రశాంతి నిలయంలో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సుందరేశ్ మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సత్యసాయి బాబా 1956లో పుట్టపర్తిలో సత్యసాయి జనరల్ ఆస్పత్రి ప్రారంభించారని, ఆ తరువాత బెంగళూరులో జనరల్ ఆస్పత్రి, ప్రశాంతి గ్రాం, వైట్‌ఫీల్డ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను స్థాపించి పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం వైద్యం ఎంతో ఖరీదైన సేవగా మారిందని, కానీ సత్యసాయి సంస్థలు మాత్రం నేటికీ ఉచితంగానే వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. ఇక్కడి సిబ్బంది సైతం రోగులను ప్రేమతో కూడిన వైద్యం సేవలు అందిస్తూ సాంత్వన కలిగిస్తున్నారన్నారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద మాట్లాడుతూ... పేదలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ఏటా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య పరికరాలను సత్యసాయి వైద్య సంస్థల్లో అందుబాటులోకి తీసుకు వస్తున్నారన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ట్రస్ట్ పని చేస్తోందన్నారు. అనంతరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టోక్యో, యూనివర్సిటీ ఆఫ్ చికాగో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేసుకున్న రెండు ఒప్పంద పత్రాలను సత్యసాయి మహాసమాధి చెంత ప్రదర్శించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వైద్య సిబ్బంది సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, డాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కట్నం కోసం వేధింపులు

కదిరి అర్బన్: కట్నం కోసం మెట్టినింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారని వివాహిత కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న మేరకు... ఓడీచెరువు ఏడీసీసీ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రవల్లిక కదిరిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసం ఉంటోంది. ఈమెకు నాలుగేళ్ల క్రితం రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న రామకృష్ణ రెండో కుమారుడు సాయికుమార్‌తో వివాహమైంది. అయితే కట్నం కింద 20 సెంట్ల స్థలం, తొమ్మిది తులాల బంగారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్న కారణంతో 15 రోజులకే ప్రవల్లికను పుట్టింటికి పంపించేశారు. తన భర్తకు రెండో పెళ్లి చేయాలనే ఉద్దేశంతో ఆయన పిన్ని శాంతమ్మ, బాబాయి కొమ్ము విజయభాస్కర్, కొమ్ము సంపత్, శంతన్‌కుమార్, వెంకటరమణ ప్రయత్నం చేస్తూ.. తనను కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ప్రవల్లిక శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారందరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

ఇద్దరు వివాహితలు అదృశ్యం

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఇద్దరు వివాహితలు అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఆయా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న బొడ్డు రవి ఆస్పత్రి ఐటీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. ఈయన భార్య శ్రీలత ఇటీవలే బుక్కరాయసముద్రం ఆర్డీటీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ ఇటీవల బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి బదిలీపై వచ్చారు. శుక్రవారం సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చిన శ్రీలత పక్కింటి వారి ఫంక్షన్‌కు వెళ్లేందుకు అవసరమైన గిఫ్ట్ తీసుకురమ్మని భర్తకు ఫోన్ చేసి చెప్పింది. గిఫ్ట్ తీసుకుని ఇంటికి వచ్చిన భర్తకు శ్రీలత కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఎన్నిచోట్ల వెదికినా ఆమె జాడ కనిపించకపోవడంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గుడికని వెళ్లి తిరిగిరాలేదు..

గుమ్మళ్లకుంట గ్రామానికి చెందిన సదాశివ, శివకాంత దంపతులు. వీరికి రిషి అనే ఏడేళ్ల కుమారుడు సంతానం. వీరు ప్రస్తుతం బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. సదాశివ ఈ నెల 17న ఉదయం 10 గంటల సమయంలో కూలి పనికి వెళ్లాడు. ఆ సమయంలో శివకాంత తన భర్తకు ఫోన్ చేసి తాను కుమారుడితో కలిసి తాడిమర్రి మండలం కునుకుంట్లలోని ఓసూరమ్మ ఆలయానికి వెళ్లి వస్తానని చెప్పింది. అయితే తిరిగి ఇంటికి చేరుకోలేదు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ దొరక్కపోవడంతో శివకాంత తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.